25న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈనెల 25న పుచ్చలపల్లి సుందర్య భవనం(సిపిఎం ఆఫీసు)లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం వరకు బిపి, షుగరు, ఫిట్స్, పెరాలసిస్ రోగులకు జిబిఆర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత రెగ్యులర్ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లుగా అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో ప్రముఖ వైద్యులు గోపాలం శివన్నారాయణ, సందీప్‌వర్మ, జి.పద్మజ, సత్యనారాయణ రాజులు పాల్గొని రోగులను పరీక్షించి, మూడునెలలకు సరిపడా మందులు రూ.300లకే ఇస్తున్నట్లుగా తెలిపారు. ఈ క్యాంపు చుట్టుపక్కల ప్రాంతాలవారు, పేదలు, మధ్యతరగతి ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. వసుధ ఫౌండేషన్ కో ఆర్డినేటర్, రిడ్కర్డ్ డిఇఒ ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ వసుధ ఫౌండేషన్, అల్లూరిసీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు, డెక్కన్ ఫైన్ కెమికల్స్, ఎస్ఎల్‌జి ఆసుపత్రి సహకారంతో సుందరయ్య భవనంలో ఉచిత ఆసుపత్రి నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు.

మొక్కుబడి గ్రామ సభలు..!

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న గ్రామ సభలు జిల్లాలో మొక్కుబడి సభలుగా సాగాయి. ప్రాధాన్యత పనులపై కనీసం చర్చ జరగలేదు. కేవలం అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రసంగాలతో తూతూమంత్రంగా నిర్వహించి మమ అనిపించారు. గంటలోపే గ్రామసభల నిర్వహణ ముగించేశారు. రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీ వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని ప్రజలు ఏకరువు పెట్టారు. ఉపాధి పనుల గురించి పూర్తిస్థాయి చర్చ జరగలేదు. గతంలో జరిగిన అభివృద్ధి పనులకు ప్రస్తుతం తీర్మానాలు చేశారు. పనులు ప్రారంభించకుండానే జరుగుతున్నట్లు చూపి తీర్మానాలు కూడా చేసేశారు. ప్రజలతో కనీస చర్చలు జరపకుండానే నిర్వహించిన గ్రామ సభల నిర్వహణ పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉండి : గ్రామ సభలో మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

జిల్లాలో తూతూమంత్రంగా గ్రామసభల నిర్వహణ
గతంలో గుర్తించిన పనులకు ఇప్పుడు తీర్మానాలు
ఉపాధి పనుల గుర్తింపుపై పూర్తిస్థాయిలో జరగని చర్చ
ప్రజా ప్రతినిధులు, అధికారుల ప్రసంగాలతోనే ముగిసిన గ్రామసభలు

ప్రజాశక్తి - భీమవరం

ఏటా అక్టోబర్ రెండో తేదీన గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయా పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభల నిర్వహణ జరుగుతుంది. అక్కడ నుంచి ఉపాధి హామీ చట్టంలో పనుల గుర్తింపు, ఇతర పనులకు సంబంధించి అక్టోబర్‌లోనే గ్రామసభలు నిర్వహిస్తారు. అయితే టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖా మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత పంచాయతీరాజ్ వ్యవస్థపై దృష్టి సారించినా రాష్ట్రమంతా ఒకేసారి గ్రామసభలు నిర్వహించడానికి శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో గ్రామ సభలను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీనిలో భాగంగా శుక్రవారం జిల్లాలో 408 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల్లోపు అన్ని గ్రామాల్లో సభలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ గ్రామ సభలో ప్రధానంగా ఐదు అంశాల్లో చర్చలు జరిగే విధంగా చర్యలు తీసుకున్నారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్, అనుసంధాన శాఖల వారితో చర్చించి కొత్త పనుల గుర్తింపు, కొత్త జాబ్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ, చనిపోయిన వారిని జాబ్ కార్డులో నుంచి తొలగింపు చర్య, ఉపాధి పనుల కల్పనలో రైతులకు మాండిస్ అవగాహన, రోజుకు రూ.300 వేతనం పొందే విధంగా కొలతలపై అవగాహన చేయడంతో పాటు వీటిపై ప్రధానంగా చర్చలు జరపడం గ్రామసభల ముఖ్యోద్దేశం. అలాగే ఉపాధి హామీ పనుల జాబితాలో గుర్తించిన 46 పనులకు సంబంధించి గ్రామసభల్లో చర్చ జరగాల్సి ఉంది. అయితే ఇవేమీ గ్రామ సభల్లో కానరాలేదు. గ్రామ సభల ప్రతిష్టను నీరుగార్చే విధంగా సభలు నిర్వహించారు. ఈ సభల్లో చర్చించిన పనులకు తీర్మానాలు చేయాల్సి ఉన్నప్పటికీ దీనికి విరుద్ధంగా తీర్మానాలు చేసినట్లు తెలుస్తోంది. సభల నిర్వహణకు కొన్ని రోజుల ముందు జిల్లా వ్యాప్తంగా అభివృద్ధి పనులు గుర్తింపు జరిగింది. ఇలా గుర్తించిన పనులను ప్రస్తుతం జరుగుతున్న గ్రామసభల ముందుకు తీసుకొచ్చి తీర్మానాలు చేస్తున్న పరిస్థితి. ఇదిలా ఉంటే గతంలో తీర్మానాలు చేసిన పనులను మళ్లీ గ్రామ సభకు తీసుకొచ్చి మళ్లీ తీర్మానాలు ఇస్తున్న పరిస్థితి నెలకొంది. చివరకు అభివృద్ధి పనులు ప్రారంభించకుండానే పనులు జరుగుతున్నట్లు చూపి చకచకా తీర్మానాలు కూడా చేసేసుకుంటున్న పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రాధాన్యత కలిగిన పనులు మరుగున పడిపోయే పరిస్థితి తలెత్తింది. జిల్లాలో రూ.70 కోట్లు కాంపోనెంట్ పనులకు సంబంధించి గ్రామసభల్లో చర్చలు జరగాల్సి ఉన్నప్పటికీ ఆ విధంగా పూర్తిస్థాయిలో చర్చలు సాగలేదు. ఉపాధి పనుల గుర్తింపుపై పూర్తిస్థాయిలో చర్చలు జరగలేదు. రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీలు వంటి సమస్యలపై ప్రజలు ఏకరువు పెట్టారు. పాలకోడేరు, గరగపర్రు, కుముదవల్లి, విస్సాకోడేరు, గొరగనమూడి, మోగల్లు, కోరుకొల్లు, మైప గ్రామాల్లో సమస్యలపై ప్రజలు ఏకరువు పెట్టారు. రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీరందించాలని ప్రజలు గ్రామసభల దృష్టికి తీసుకొచ్చారు. వీరవాసరంలో పనులు ప్రారంభించకుండానే పనులు జరుగుతున్నట్లు చూపి తీర్మానం చేసే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు దృష్టికి సమస్యలు తీసుకెళ్లడంతో ఆ పనులు రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. పెదకాపవరంలో గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు కనీసం సమాచారం అందించలేదని ప్రజలు అధికారులను నిలదీశారు. కలింగగూడెంలో రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గతంలో రెండు రోడ్లు నిర్మించాలని తీర్మానించారు. ప్రస్తుతం జరుగుతున్న గ్రామ సభలో మరోసారి తీర్మానం చేయడంతో పాటు మరో రోడ్డు నిర్మాణానికి తీర్మానించారు. కాళ్లలో చెరువుల్లో పూడిక తీత, కప్పా డ్రెయిన్ల తవ్వకాలు, చెరువులను బాగు చేయాలని కోరారు. ప్రధానంగా ఉన్న ఉపాధి పనులపై పూర్తిస్థాయిలో చర్చ జరగలేదు. కనీసం ప్రజలతో చర్చించకుండానే అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల ప్రసంగాలతో గ్రామ సభలను మమ అనిపించేశారు. ఈ నేపథ్యంలో గ్రామసభల నిర్వహణపై సార్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం తీసుకున్న లక్ష్యానికి అనుగుణంగా గ్రామసభలు జరగలేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు.



మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

గ్రామ స్వరాజ్యమే లక్ష్యం

జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని లంకలకోడేరు గ్రామ పంచాయతీ వద్ద ఉపాధి హామీ చట్టంలో భాగంగా గ్రామసభను జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాపూజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి పెట్టి మొదటి విడతగా రూ.1,400 కోట్లను విడుదల చేశారని తెలిపారు. గ్రామ పంచాయతీల నిధులు కాజేసి సర్పంచులను భిక్షమెత్తుకునేలా చేసిన ఘనత గత ప్రభుత్వానిదన్నారు. కేంద్రం, రాష్ట్రం ద్వారా కేటాయించిన నిధులను నేరుగా గ్రామ పంచాయతీలకే పంపిస్తే, కనీసం బ్లీచింగ్, ముగ్గు గాని ఒక బస్తా కొనలేని పరిస్థితి, కనీసం చెత్తను తీసుకెళ్లే కార్మికులకు జీతం చెల్లించలేని పరిస్థితి గ్రామ పంచాయతీలకు ఉండేదని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థల నడ్డివిరిస్తే, కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఊపిరిపోస్తోందని తెలిపారు. కేంద్ర ఆర్థిక సంఘం, పంచాయతీ నిధులు సర్పంచులకే ఇచ్చి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13,326 సర్పంచులు గ్రామాల్లో తలెత్తుకునేలా చేస్తున్న ఘనత చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ది అన్నారు. సంక్షేమం, అభివృద్ధి ప్రజల మనోభావాలకు అనుగుణంగా పాలన చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. 2014-2019 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల ఆదాయం రూ.240 కోట్లు ఉంటే 2019-2023లకు రూ.170 కోట్లకు ఆదాయం పడిపోయిందన్నారు. గత ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేస్తే కూటమి ప్రభుత్వం పంచాయతీలకు పూర్వ స్వతంత్ర ప్రతిపత్తితో తగిన గౌరవాన్ని ఇచ్చి కాపాడుతున్నామని మంత్రి రామానాయుడు అన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలు దశలవారీగా పరిష్కరించుకుని, పల్లె సీమలను పసిడి సీమలుగా అభివృద్ధి చెందడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఉపాధి హామీలో భాగంగా ప్రతి కార్మికునికీ కనీసం వంద రోజులు పని ఇవ్వాలని, వారికి 15 రోజుల్లోగా నగదును వారి బ్యాంకు ఖాతాల్లో చెల్లించాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నాలుగు అంశాలపై చర్చించి గ్రామ నిర్మాణంలో గ్రామ వికాసం దిశగా అడుగులు వేయాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో కలిసికట్టుగా పనిచేస్తే గ్రామాలు అభివృద్ధి చెంది స్వరాజ్య స్థాపనకు మంచి ఫలితాలు వస్తాయన్నారు. కేవలం మట్టి పనులు కాకుండా ఇతర పనులు కూడా చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ అచ్యుత అంబరీష, మాజీ శాసనమండలి సభ్యులు అంగర రామ్మోహన్, జిల్లా డ్వామా పీడీ ఎం.ప్రభాకరరావు పాల్గొన్నారు.

వైసిపి ఏలూరు జిల్లా అధ్యక్షునిగా 'దూలం'..!

దూలం నాగేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లా వైసిపి అధ్యక్షునిగా వైసిపి కైకలూరు మాజీ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావును ఎంపిక చేస్తూ వైసిపి అధిష్టానం నిర్ణయం తీసుకుంది. దీంతో కొద్ది రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఏలూరు జిల్లా వైసిపి అధ్యక్షుడిగా ఉన్న మాజీ మంత్రి ఆళ్లనాని కొద్దిరోజుల క్రితం రాజీనామా చేశారు. అప్పటినుంచి జిల్లా సారథిగా ఎవరిని నియమిస్తారోనన్న చర్చ రాజకీయాల్లో కొనసాగుతోంది. జిల్లా అధ్యక్ష బాధ్యతలు తీసుకునేందుకు నాయకులెవరూ ముందుకు రాకపోవడంతో అధిష్టానం తీవ్ర ఆలోచనలో పడింది. తర్జనభర్జన అనంతరం దూలం నాగేశ్వరరావును ఎంపిక చేసింది. దూలం 2019లో వైసిపి తరపున కైకలూరు ఎంఎల్‌గా పోటీచేసి గెలిచారు. 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌పై పరాజయం పాలయ్యారు. బలమైన కాపు సామాజిక తరగతికి చెందిన నేతగా దూలంకు పేరుంది. ప్రస్తుత పరిస్థితుల్లో దూలం నాగేశ్వరరావును జిల్లా అధ్యక్షునిగా నియమిస్తే బాగుంటుందని ఆలోచన చేసి నియమించినట్లు తెలుస్తోంది. ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా గంటా ప్రసాద్, మామిడిపల్లి జయప్రకాష్ నారాయణ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. నియోజకవర్గ ఇన్‌ఛార్జి నియామకంపై రెండు, మూడు రోజుల్లో నిర్ణయం వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది.

నిందితులను శిక్షించాలని న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - నరసాపురం

కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నరసాపురం న్యాయవాదుల సంఘం డిమాండ్ చేసింది. ఈ అమానుష చర్యను నిరసిస్తూ న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించారు. అనంతరం స్థానిక అంబేద్కర్ సెంటర్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు చేగొండి శ్రీరంగమోహన బాలాజీ మాట్లాడుతూ మహిళలపై అఘాయిత్యాలను అరికట్టడానికి ప్రత్యేక చట్టాలను రూపొందించాలన్నారు. ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ మాట్లాడారు. మహిళా వైద్యురాలిపై జరిగిన అఘాయిత్యాన్ని ఖండించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంపా పుల్లాజీ, ఉపాధ్యక్షులు కొత్తపల్లి రమేష్, మహిళా ప్రతినిధి బి.ప్రగతి, కోశాధికారి పూరిళ్ల శ్రీనివాస్, కార్యదర్శి కురెళ్ల సోమశేఖర్, క్రీడల కార్యదర్శి మేడిది శ్రీమంత్, కార్యవర్గ సభ్యులు కురెళ్ల అన్నపూర్ణ, కొప్పర్తి నాగశిరీష, న్యాయవాదులు దేవ రంజిత్‌కుమార్, యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్, ఉల్లంపర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

పరిశోధనలతోనే ఉన్నత శిఖరాలు

విశిష్ట శాస్త్రవేత్త డాక్టర్ బివి.పాపారావు

తాడేపల్లిగూడెం: పరిశోధనల్లో కొత్త శిఖరాలను అధిరోహించటం అత్యంత అవసరమని అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లాబోరేటరీ డైరెక్టర్(ఎఎస్ఎల్, డిఆర్ డిఒ) విశిష్ట శాస్త్రవేత్త డాక్టర్ బివి.పాపారావు విద్యార్థులకు సూచించారు. ఎపి నిట్‌లోని బిటెక్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందిన 455 మంది విద్యార్థులకు వారం రోజులుగా నిర్వహిస్తున్న ఇండక్షన్ ప్రోగ్రామ్ శుక్రవారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డాక్టర్ పాపారావు మాట్లాడుతూ రక్షణ, పరిశోధన రంగంలో భారత్ స్వావలంబన సాధించి ప్రపంచానికి స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. విద్యార్థులు చేపట్టే నూతన ఆవిష్కరణలు ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేలా ఉండాలన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం కష్టపడాలన్నారు. ఆచార్యులు చెప్పే పాఠ్యంశాలను శ్రద్ధగా విని, సందేహాలుంటే ఆచార్యులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. అనంతరం పాపారావును రిజిస్ట్రార్ ఘనంగా సత్కరించారు. ముందుగా జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ జిఆర్‌కె శాస్త్రి, డాక్టర్ జిబి.వీరేష్ కుమార్, డాక్టర్ టి.కురుమయ్య, డాక్టర్ ఎన్.జయరామ్, అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లు ధాన్యానికి బియ్యాన్ని ఇవ్వాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం: జిల్లాలోని రైస్‌మిల్లర్స్ అందరూ ఈనెలాఖరులోపు ప్రభుత్వం కేటాయించిన ధాన్యానికి బియ్యాన్ని అప్పగించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం తాడేరు రైస్‌మిల్లును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లింగ్ విధానాన్ని పరిశీలించి, స్టాక్ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ బియ్యం సేకరణ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వంకు జమ చేయవలసిన బియ్యం సేకరణను వేగవంతం చేసి, ఈనెల చివరినాటికి నూటికి నూరు శాతం అప్పగించేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. బియ్యం ఇవ్వవలసిన మిల్లులను మండలాల వారీగా జాయింట్ కలెక్టరు సమీక్ష చేశారు. ఇ-పంట నమోదు, వ్యవసాయ శాఖలోని అన్ని పథకాలకు దీనినే ప్రామాణికంగా తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇ-పంట నమోదు ప్రక్రియ వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ వెంట సివిల్ సప్లై జిల్లా మేనేజరు టి.శివ రామప్రసాద్, డిఎస్ఒఎన్.సరోజ, ఎఎస్ఒ ఎం.రవిశంకర్, ఎఎస్ఒ టెక్నికల్ మహమ్మద్ ఇబ్రహీం ఉన్నారు.

28న రేవు వేలం పాట

నరసాపురం: నరసాపురం-మాధవాయిపాలెం రేవు పాటను ఈనెల 28న నిర్వహించనున్నారు. సీల్డ్కం బహిరంగ పద్ధతిలో జరగనున్న ఈ వేలంపాటకు సంబంధించి టెండరు షెడ్యూళ్ల అమ్మకం చివరి రోజు శుక్రవారం నాటికి ఆరుగురు టెండరు షెడ్యూళ్లు కొనుగోలు చేసినట్లు ఎంపిడిఒ కె.వీరభద్రరావు శుక్రవారం తెలిపారు. ది నరసాపురం శాండ్ క్వారీ బోట్స్ మెన్ ఫిషర్మెన్ కో ఆపరేటివ్ సొసైటీ, ది లక్ష్మీపాలెం శాండ్ క్వారీ బోట్స్‌మెన్ ఫీల్డ్ లేబర్ ఫిషర్మెన్ కో ఆపరేటివ్ సొసైటీ, కనకాయలంకకు చెందిన ది కనకదుర్గా శాండ్ క్వారీ బోట్స్‌మెన్ ఫీల్డ్ లేబర్ ఫిషర్మెన్ కో ఆపరేటివ్ సొసైటీ, మాధవాయిపాలెంకు చెందిన అమరేశ్వర మెరైన్ ఫిషర్మెన్ ల్యాండ్ క్వారీ బోట్స్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీ, నరసాపురానికి చెందిన భూపతి మంగయ్య నాయుడు, రౌతులు రఘుబాబు అనే ఆరుగురు టెండరు షెడ్యూళ్లు కొనుగోలు చేసినట్లు ఎంపిడిఒ తెలిపారు. 28న జరిగే పాటలో ముందుగా వీటిని దాఖలు చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత బహిరంగ పాటలో పాల్గొంటారు.

స్వాతంత్ర సమరయోధుడు టంగుటూరి

జయంతి కార్యక్రమంలో మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతి ఉత్సవాలను శ్రీక్షీరా రామ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి మంత్రి నిమ్మల రామానాయుడు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వాతంత్ర సమర యోధుడు, నిరుపేద కుటుంబంలో పుట్టి, వారాలు చేసుకుంటూ చదువుకుని, ప్రకాశం పంతులు ఉమ్మడి ఎపి తొలి సిఎం అయ్యారని మంత్రి తెలిపారు. టిడిపి, బిజెపి, జనసేన నాయకులు కలిసి ఉత్సవాలను ఘనంగా జరుపుట చాలా సంతోషంగా ఉందన్నారు. 1940, 50 దశకాల్లో ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన వ్యక్తుల్లో ప్రకాశం ఒకరు అని, ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణాయక పాత్ర పోషించారన్నారు. దేశంలో ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా బతుకుతున్నామంటే త్యాగధనులలో ప్రకాశం పంతులు ప్రథములలో ఒకరని మంత్రి అన్నారు. దేశ స్వతంత్ర మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకి ఎదురుగా గుండెనుంచిన మహా వీరుడు, ఆంధ్రకేసరి అని పేరు పొందారన్నారు. 'ఆంధ్ర కేసరి'గా వారిని తెలుగు ప్రజలు గౌరవంగా పిలుచుకుంటారని, ప్రకాశం పంతులు నేటి ప్రకాశం జిల్లాలో ఒక పేద కుటుంబంలో జన్మించారని మంత్రి తెలిపారు. తెలుగు వారి ముద్దుబిడ్డను కన్న ధన్యజీవులు గోపాలకృష్ణయ్య, సుబ్బమ్మ దంపతులని, ప్రకాశం తన పదకొండవ ఏటనే పితృవియోగం కలిగిందన్నారు. ప్రకాశం న్యాయవాది కావాలనే బలమైన కాంక్ష ఉన్నప్పటికీ, మెట్రిక్యులేషన్ పరీక్షలోనే ఉత్తీర్ణులు కాలేక పోయారన్నారు. దానికి కారణం ఆయనకు స్నేహితులు ఎక్కువ అని, ఒక పక్క నాటకాలలో వేషాలు వేస్తూనే పట్టుదలతో చదివి, మద్రాసుకు వెళ్లి, అక్కడలా కాలేజీలో చదివి రాజమహేంద్రవరంలో న్యాయవాది వృత్తిని ప్రారంభించారని మంత్రి తెలిపారు. ఒక జిల్లాకు ఆయన పేరు, కృష్ణానది బ్యారేజీకి ఆయన పేరు పెట్టారని మంత్రి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, క్షీరాపురి బ్రాహ్మణ సేవా సంఘం వ్యవస్థాపకులు సోమంచి శ్రీనివాస శాస్త్రి, కార్యదర్శి నందుల దశరథ్, కోశాధికారి గోటేటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు హెూతా హరి నారాయణ, కస్తూరి సుబ్బారావు, నిట్టల శైలజ, ఆనిమళ్ల రమణకుమారి, చాగంటి రామ్ ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రకాశం పంతులకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి

జిల్లాలో పలు చోట్ల వర్షం

ప్రజాశక్తి - పెనుమంట్ర

శుక్రవారం తెల్లవారుజాము నుంచి పడుతున్న వర్షానికి మండలం మొత్తం తడిసిముద్దయ్యింది. ఇప్పటికే మండలంలో వర్షపాతం 36 మిల్లీమీటర్లు మించిపోయింది. ఈ వర్షానికి రోడ్లు అధ్వానంగా తయారవ్వడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

మొగల్తూరు : మండలంలో శుక్రవారం తెల్లవారుజామున ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో గ్రామాల్లోని రహదారులు జలమయమయ్యాయి. మొగల్తూరు - వెంప రోడ్డు ఛిద్రమవ్వడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతల్లో వర్షపు నీరు నిలిచి మడుగులను తలపించాయి. గ్రామాల్లో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక రహదారిపై నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత కొద్దిరోజులుగా అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో ఎండవేడికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి ప్రజలు ఉపశమనం పొందారు.

పాలకొల్లు : పాలకొల్లులో శుక్రవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం పడింది. ఉరుములు, మెరుపులతో పిడుగులు కూడా పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. కనీసం పాలు కూడా తెచ్చుకోవడానికి, కుళాయి నీరు పట్టుకోవడానికి వీలు లేకుండా వర్షం పడింది. ఈ నేపథ్యంలో రోడ్లు, డ్రెయిన్లు ఏరులై పొంగాయి. ఇంకా సిల్ట్ తీయని ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. ఉదయం 10 గంటలు తరువాత వాతావరణం కొంత ఊరట ఇచ్చింది.

మడుగును తలపిస్తున్న మొగల్తూరు - వెంప రోడ్డు

ప్రభుత్వ వైద్యాన్ని పేదలకు మరింత చేరువ చేయాలి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ప్రభుత్వ వైద్యం పేదలకు చేరువుగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మండలంలోని లంకల కోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా సందర్శించి, ఆసుపత్రిలో అన్ని విభాగాలను తనిఖీచేశారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వెద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి వార్డు, జనరల్ వార్డు, తదితర విభాగాలను సందర్శించారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల గూర్చి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఒపి, ప్రసవాలు, జ్వరాల కేసుల వివరాలను వైద్యులు కలెక్టర్‌కు వివరించారు. ఒపి రిజిస్టర్, ఎన్‌సిడి రిజిస్టర్, టిబి కేసుల నమోదు రిజిస్టర్‌లను పరిశీలించారు. పిహెచ్‌సి పరిధిలో 36 టిబి కేసులు నమోదైనట్లు డాక్టర్లు తెలిపారు. అలాగే టైఫాయిడ్ కేసులు ఈ సీజన్లో వస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలలో ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకం కలిగించాలన్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, మెరుగైన వైద్యం అందించినప్పుడే వైద్యులుగా మీరు గుర్తింపు పొందుతారు. సమాజానికి కూడా మంచి జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆసుపత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. పిహెచ్‌సి సందర్శన సందర్భంలో గురువారం జన్మించిన శిశువు తల్లికి శిశువు పుట్టిన తేదీ, సర్టిఫికెట్‌ను జిల్లా కలెక్టర్ చేతుల మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ ఆనంద్, తహశీల్దార్ వై.దుర్గా కిషోర్, పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ఎం.నవ్య జీవన్, స్టాఫ్‌నర్స్‌లు కె.ముత్యాల వల్లి, కె.ప్రియాంక, ఎం.ఉమా సౌజన్య, పిహెచ్‌ఎన్ పి.ఎలిజిబెత్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఆర్‌డిఒ

క్రీడాకారిణి జ్యోతికకు 'మానవత' సత్కారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఇటీవల ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొని జిల్లాకు అంతర్జాతీయ కీర్తిని దండి జ్యోతికశ్రీ తెచ్చారని మానవత స్థానిక శాఖ అధ్యక్షులు, పీడీ కర్రి కృష్ణారెడ్డి అన్నారు. మార్టేరులో మానవత ఆధ్వర్యంలో అంతర్జాతీయ అథ్లెటిక్ క్రీడాకారిణి దండి జ్యోతికశ్రీ(తణుకు) పార్టిసిపేట్ ఇన్ పారిస్ ఒలింపిక్స్ 2024కు ఘన సన్మానం చేసి, సత్కరించి, పలువురు అభినందించారు. ముఖ్యఅతిథిగా ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తనయుడు హాజరై మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడలు అనేవి అంతర్జాతీయ సహకారం, సాంస్కృతిని అందరికీ అందిస్తుందని, అథ్లెటిక్ క్రీడాకారిణి దండి జ్యోతికశ్రీ అంతర్జాతీయ స్థాయిలో భారతదేశం తరుపున ప్రాతినిధ్యం వహించి దేశానికి అత్యున్నత కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిందని కొనియాడారు. గాలి కంటే వేగంగా, చిరుత కంటే స్పీడ్‌గా తన ప్రతిభతో మరో పిటి ఉషాగా దేశ క్రీడాకారుల మధ్య నిలబడుతుందని, తోటి క్రీడాకారులకు, విద్యార్థులకు స్ఫూర్తిగా ఉంటుందని పలువురు వక్తలు కొనియాడారు.

దండి జ్యోతికశ్రీ, కోచ్ కృషి అపూర్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం గొప్పదని వారు అన్నారు. అదేవిధంగా మార్టేరు అంతర్జాతీయ క్రీడాకారుడు సత్తి సుబ్బన్నరెడ్డి, సత్తి గీత, దండి జ్యోతికశ్రీ ఖ్యాతి శాశ్వతం ఉంటుందని క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వెంకట్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విజిహెచ్ హైస్కూల్ హెచ్‌ఎం చిన్న సూర్యనారాయణ రెడ్డి, మానవత ప్రెసిడెంట్, జిల్లా సెక్రెటరీ కొత్త సత్యనారాయణమూర్తి, రీజనల్ ఛైర్మన్ బాణాల శ్రీనివాసరావు, సెక్రెటరీ మురళీకృష్ణ, కోశాధికారి నరేంద్ర, వైస్ ప్రెసిడెంట్ బండి ప్రసాద్, కో ఛైర్మన్ పడాల జగన్నాథ్ రెడ్డి, వెలుగు జ్యోతి, ఎడిటర్ ఎన్.విజయరాజు, పలువురు టిడిపి నాయకులు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరందిస్తాం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - నరసాపురం

ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శుక్రవారం నరసాపురం మండలం కొత్తనరసాపురం గ్రామంలో జల జీవన్ మిషన్ స్కీం ద్వారా రూ.55 లక్షలతో కుళాయి పనులకు ఎంఎల్ఎ నాయకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 100 శాతం స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఆకన చంద్రశేఖర్, వత్రిపోలు సతీష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని రాజుగారి తోటలో రూ.25 లక్షలు, సీతారామపురం సౌత్ రూ.40 లక్షల ఉపాధి హామీ చట్టం నిధులతో నిర్మిస్తున్న సీసీ రహదారి పనులకు శుక్రవారం ఎంఎల్ఎ నాయకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలవల నాని, ఘంటా కృష్ణ, బందెల రవీంద్ర, గుబ్బల మర్రాజు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం ఎస్‌విఎస్ అండ్ విఐసి జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి ఒప్పందం ప్రాతిపదికన పనిచేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ చాబత్తుల ప్రభువరం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిజిలో సంబంధిత సబ్జెక్ట్‌లో కనీసం యాభై శాతం తక్కువ కాకుండా ఉత్తీర్ణత అయినవారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తుదారులు తమ ధృవపత్రాలతో భీమవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారిని ఈనెల 24న వారి కార్యాలయంలో జరుగు ఇంటర్వ్యూకు నేరుగా హాజరవ్వాలన్నారు. ఇంగ్లీషు, ఫిజిక్స్, బోటనీతో పాటు ఒకేషనల్ విభాగంలో ఇఇటి, ఐటి పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

2న పలు రైళ్లు దారి మళ్లింపు

ప్రజాశక్తి - నరసాపురం

సాంకేతిక పనుల దృష్ట్యా సెప్టెంబరు 2వ తేదీ నుంచి 29 వరకు విజయవాడ డివిజన్లో పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేయడంతో పాటు దారి మళ్లిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. నర్సాపూర్-విజయవాడ(07863), (07283) విజయవాడ-భీమవరం జంక్షన్, (07861) విజయవాడ-నర్సాపూర్ తదితర రైళ్లు రద్దు చేశారు.

ఘనంగా అంతరిక్ష దినోత్సవం

ప్రజాశక్తి - తణుకు

ఈనెల 23వ తేది మొదటి జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నామని కళాశాల ప్రిన్సిపల్ యుఎల్.సుందరీబాయ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల యుజి, పిజి(అటానమస్)లో ఎన్‌సిసి, భౌతికశాస్త్రం విభాగం వారు నేషనల్ స్పేస్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరీబాయ్ మాట్లాడుతూ గత సంవత్సరంలో ఇదే రోజున చంద్రయాన్-3 మిషన్ చంద్రుని ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్‌ను సురక్షితమైన ల్యాండింగ్‌ని సాధించిందన్నారు. భౌతికశాస్త్రం అధ్యపకురాలు టి.రూపవల్లి మాట్లాడుతూ మొట్టమొదటి చంద్రయాన్-1 అక్టోబర్ 2008లో చంద్రుడు మీద నీటి పరిశోధనలు కోసం, చంద్రయాన్-2 చంద్రుని ఉపరితలంపై నీటి పరిశోధనకు ల్యాండింగ్ పరిశోధనల కోసం, జులై 2019న చంద్రుని మీదకు పంపండం జరిగిందన్నారు. కొన్ని కారణాల వల్ల విజయవంతం కాకపోవడం, చంద్రయాన్-3 మిషన్ చంద్రుని ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్‌ను ల్యాండింగ్ సాధించిందన్నారు. ఈ సంవత్సరం వేడుకల థీమ్(టచింగ్ లైవ్స్ వైల్ టచ్ ది మూన్)గా జరుపుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కె.వెంకటలక్ష్మీ, ఎన్‌సిసి కేడెట్స్, విద్యార్థినులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరంలోని సిగ్ని స్కూల్ ఫౌండర్, కరెస్పాండెంట్ శాంతి సింగ్ సహకారంతో 1వ, 2వ వార్డ్‌లోని అంగన్వాడీలో నమోదు కాబడిన, ఏడునెలలు నిండిన 12 మంది గర్భిణులకు శుక్రవారం శ్రీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణులందరూ ఆరోగ్యమైన శిశువుకి జన్మనిచ్చి, వారిని ఈ సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా తీర్చిదిద్దె భాధ్యత ప్రతీ తల్లిపై కలదని, దానికి ప్రతీ తల్లి ఆరోగ్యవంతమైన ఆహారంతో పాటు ప్రశాంతమైన జీవితాన్ని గడపాలి కోరుకుంటున్నామని తెలిపారు. శ్రీమంతం నిర్వహించి, పౌష్టికమైన ఆహారాన్ని అందించామని తెలిపారు. సిడిపిఒ లక్ష్మీ కాంతం, సరళ పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్థానిక ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో భీమవరం మండల న్యాయ సేవల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గుడ్ టచ్-బాడ్ టచ్, రైట్స్, డ్యూటీస్, చైల్డ్ లేబర్, చైల్డ్ బెగ్గింగ్, విద్య హక్కులకు సంబంధించి విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి యోహాను(న్యూటన్) మాట్లాడుతూ విద్యార్థులు గుడ్ టచ్-బాడ్ టచ్‌ల మధ్య తేడా తెలుసుకోవాలని, ఎవరైనా బాడ్ టచ్ చేస్తే వారిని నిరోధించాలని, సదరు విషయాన్ని స్కూల్ యాజమాన్యంకు, తల్లిదండ్రులకు వెంటనే తెలియజేయాలని తెలిపారు. విద్యతో బంగారు భవిషత్‌కు బాటలు వేసుకోవాలని, తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించాలని తెలిపారు. ఈ సదస్సులో సీనియర్ న్యాయవాది జి.విజయకుమార్, మహిళా న్యాయవాది సత్యవిజ్ఞాన దేవి, ప్యానెల్ న్యాయవాదులు పి.అంబేద్కర్, బి.లోకేష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వాహనదారులంతా హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం ద్వారా ప్రాణాలు రక్షించుకోవచ్చుని ట్రాఫిక్ ఎస్ఐ కొండలరావు సూచించారు. హెల్మెట్ ఉపయోగించాలని కోరుతూ శుక్రవారం ఆదిత్య డిగ్రీ కాలేజ్ విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం ద్వారా ప్రాణాలు కోల్పోయిన వారి వివరాలు చెబుతూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మీ సరోజ, విద్యార్థులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ దిక్సూచిని సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

నరసాపురం: నిరుద్యోగ యువత ఉద్యోగ దిక్సూచి ద్వారా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రయోజకులు కావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం నరసాపురం వైన్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ దిక్సూచి(ప్లేస్మెంట్ డ్రైవ్) కార్యక్రమంలో కలెక్టర్, నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ కంపెనీల ఇంటర్వూలకు ఏర్పాటుచేసిన అన్ని రూములను సందర్శించి, ఇంటర్వూలకు హాజరైన విద్యార్థులతో మాట్లాడి, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఉత్సాహపరిచారు. శుక్రవారం ప్లేస్మెంట్ డ్రైవ్‌లో 19 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీటిలో వివిధ కంపెనీల్లో 195 మంది ఉద్యోగానికి అర్హత పొంది ఉన్నారు. మరికొన్ని కంపెనీలు ఫలితాలను ప్రకటించాల్సిన ఉంది. పిడిఆర్ డిఎం వేణుగోపాల్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మంగపతి రావు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పలు ప్రాంతాలలో వరుసగా మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను గురువారం సాయంత్రం అరెస్టు చేసినట్లు పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం సబ్ డివిజనల్ అధికారి డిఎస్ఎన్.మూర్తి పర్యవేక్షణలో తాడేపల్లిగూడెం పట్టణ సిఐ ఎ.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఎస్ఐ నాగరాజు, వారి సిబ్బంది సహకారంతో తాడేపల్లిగూడెం టౌన్ పరిధి, దేవరపల్లి, గోపాలపురం, నిడదవోలు, ఏలూరు-2 పట్టణ, కొరుకొండలో వరుస మోటార్ బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్న ప్రకాష్‌రావు పాలెం చెందిన పూలపల్లి శివ సుబ్రహ్మణ్యం(28), తాడేపల్లిగూడెం జువ్వలపాలెంకి చెందిన మరపట్ల రాజ్ కుమార్(25)లను నల్లజర్ల రోడ్‌లో పాడుబడిన మిర్చి దాబా వద్దపై ముద్దాయిలను అదుపులోకి తీసుకొన్నట్లు పట్టణ సిఐ తెలిపారు. వారి వద్ద నుంచి సుమారుగా రూ.3.85 వేలు విలువైన 8 మోటార్ బైకులను రికవరీ చేసినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పంచాయతీలే దేశానికి పట్టుకొమ్మలు

అభివృద్ధి పనుల ఆమోదానికి పలుచోట్ల గ్రామసభలు

మొగల్తూరు : గ్రామసభలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామాలు అభివృద్ధి పథంలో నడిస్తేనే రాష్ట్రం, దేశం బాగుంటుందని టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. శుక్రవారం కాళ్ల గ్రామంలో జరిగిన గ్రామసభకు హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి పట్టుకొమ్మలు గ్రామాలేనని నమ్మిన రాష్ట్ర ప్రభుత్వం గ్రామసభల ద్వారా గ్రామాలలో అవసరాలను గుర్తించడం, అందుకు తగ్గ అభివృద్ధి పనుల నిర్వహణ కోసం ప్రణాళికలు రూపొందించుకుని గ్రామస్థుల సమక్షంలో ఆమోదించడం జరుగుతుందన్నారు. ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు తనయుడు కనుమూరు భరత్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బందా విజయ, ఎంపిడిఒ జి.స్వాతి, ఉప సర్పంచి పన్నాసి వెంకటేశ్వరరావు, పంచాయతీ గ్రామ కార్యదర్శి బి.సతీష్ కుమార్, పార్టీ మండల అధ్యక్షులు గుండాబత్తుల వెంకట నాగేశ్వరరావు, బిజెపి మండల అధ్యక్షులు సుంకర కాశీ, జనసేన గ్రామ అధ్యక్షులు బండారు సోమేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

గ్రామసభలో గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తూ పంచాయతీలు తీర్మానాలు చేశాయని కాళ్ల ఎంపిడిఒ జి.స్వాతి తెలిపారు. మండలంలోని 21 గ్రామాల్లో అన్ని పంచాయతీల్లో కూడా గ్రామసభలు ఒకేసారి నిర్వహించారు. మండలంలో ఆయా పంచాయతీల్లో సుమారు రూ.18 కోట్ల అంచనా వ్యయంతో 400 పనులు చేసేందుకు తీర్మానాలు చేశారు.

గణపవరం : ఉపాధి హామీ చట్టంతో జరిగే పనులతో గ్రామాలు అభివృద్ధి చెందటానికి అవకాశం ఉటుందని ఉంగుటూరు ఎంఎల్ఎ పచ్చమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం గణపవరం పంచాయతీ ఆవరణలో జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులను గుర్తించి ప్రణాళిక అధికారులు తయారుచేసి తీర్మానం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మూర అలంకారం, ఎంపిడిఒ జి.సూర్యనారాయణ, మండల పరిషత్తు ఉపాధ్యక్షురాలు సలాది రత్న దుర్గాకుమారి, పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్ ప్రసాద్, టెక్నికల్ టిఎ.సురేంద్ర, జనసేన, టిడిపి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ఆచంట : ఆచంట పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి కోట సరోజిని అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో పలువురు గ్రామ ప్రజలు మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన ఆచంట చుట్టూ ఆవరించి ఉన్న మురుగు డ్రెయిన్ ఆక్రమణలు, సిల్ట్ తొలగించి మురుగు ముందుకు పారేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు. ఏ గ్రామంలో చూసినా మురికినీటి సమస్యకు మోక్షం లభించడం లేదన్నారు. దీంతో నిత్యం ఆయా గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదన్నారు. ఇందిరమ్మ కాలనీలో రహదారులు, అంతర్గత డ్రెయిన్‌లు లేకపోవడంతో ఆయా కాలనీవాసులు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు సుంకర సీతారాం, విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, బుల్లయ్య, పద్మావతి, మాధవరావు, నేలపూడి బేబీ, గణేషుల శేషవాని, జక్కంశెట్టి చంటి, శ్రీరాములు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ సుగుణ సంధ్య పాల్గొన్నారు.

ఆకివీడు : గ్రామసభ పేరుతో సభ నిర్వహిస్తున్నప్పుడు కనీసం ప్రచారం కూడా చేయరా, గ్రామస్తులకు చెప్పకుండా గ్రామసభ నా అంటూ గ్రామస్తులు నిలదీశారు. పెదకాపవరం మినహా అన్ని గ్రామాలలోని గ్రామసభలు ప్రశాంతంగా ముగిశాయి. శుక్రవారం ఒకేరోజు మండలం అంతటా నిర్వహిస్తున్న గ్రామసభల్లో భాగంగా పెదకాపవరంలో గ్రామ సర్పంచి బేబీ జ్యోత్స్న అధ్యక్షురాలుగా గ్రామసభ ప్రారంభమైంది. కనీసం అరగంటపైగా సభ ప్రారంభంలోనే రసాభాసగా మారింది. కొద్దిసేపు తర్వాత అధికారులు, స్థానికులు, పెద్దలు చెప్పడంతో కొద్దిమంది ఆగారు అయితే ఈ అంశంపై సుమారు గంటసేపు వాదోపవాదాలు జరిగాయి. చివరకు మాటలతోటే ప్రశాంతంగా సభ ప్రారంభమైంది. కాగా కాలింగిగూడెంలో సర్పంచి గురువేలు అన్నపూర్ణ, రాజులపేటలో సర్పంచి ఎన్విరామరాజు, అయ్య భీమవరంలో సర్పంచి సామ్రాజ్యంలో అధ్యక్షతన సభలు ముగిశాయి. ఒక కాలింగిగూడెం మినహా మరి ఎక్కడా అదనపు ప్రతిపాదనలు చోటు చేసుకోలేదు.

పెనుమంట్ర : స్థానిక మండలంలోని నెగ్గిపూడి గ్రామంలో శుక్రవారం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామసభల నిర్వహణ కాస్తా ఉదయం నుంచి కురుస్తున్న వర్షం కారణం, స్థానిక అధికారుల నిర్లక్ష్యంతో లక్ష్యానికి తగని విధంగా తయారైందని పలువురు విమర్శించారు. కేవలం కొద్దిమందితో మమ అనిపించే రీతిగా అధికారులు, వారి సిబ్బంది ప్రవర్తించడం, అదేవిధంగా కనీస సమాచారం పంచాయతీ పాలకవర్గ సభ్యులకు లేకపోవడంతో వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉండి: మండలంలోని మహా దేవపట్నం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఐఎఎస్ పూర్తిచేసిన తర్వాత మహదేవపట్నం గ్రామంలోనే పారిశుధ్యం, తదితర అంశాలపై ట్రైనింగ్ తీసుకున్నానని, దాని ద్వారా గ్రామంలోని ప్రధాన సమస్యలైన డ్రెయినేజీలు, రహదారులు, మంచినీటి సమస్య వంటి వాటిపై తనకు అవగాహన ఉందని అన్నారు. ఆ సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం సర్పంచి వనిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి, నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు సమస్యలను జెసి దృష్టికి తీసుకెళ్లారు. మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు గుత్తుల కనకమహాలక్ష్మి, గ్రామ ఉపసర్పంచి ముదునూరి సుబ్బరాజు, మాజీ ఎంపిటిసి గంధం బుజ్జి, నాయకులు, కార్యకర్తలు, అధి కారులు, ఉపాధి హామీ కూలీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పెనుగొండ : మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం సమస్యలపై శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామ సర్పంచి నక్క శ్యామల సోనికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి షేక్ పాదుషా మాట్లాడుతూ ఉపాధి హామీ పనులను చేసే కార్మికులకు రూ.300 వేతనం వచ్చేలా అధికారులు కృషి చేయాలని అన్నారు. వేతనంలో కోతపడి 150 నుంచి 260 రూపాయల వరకు మాత్రమే ఇస్తున్నందున అధికారులు పూర్తిస్థాయి వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

తణుకు రూరల్ : గ్రామాభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించుకోవడానికి గ్రామ సభలు దోహదపడతాయని ఎంఎల్‌సి వంకా రవీంద్ర పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రజలకు జరుగనున్న లబ్ధిని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో తణుకు ఎంపిపి రుద్రా ధనరాజు, జెడ్‌పిటిసి ముళ్లపూడి అన్నపూర్ణదేవి, సర్పంచి అడ్డా బాబు, గ్రామ కార్యదర్శి జి.భాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గణపవరం : అధికారికి వినతిని అందజేస్తున్న వ్యకాస నాయకులు

గణపవరం : ప్రభుత్వం గ్రామసభలో ప్రవేశపెట్టిన పనులంతా మెట్ట ప్రాంతానికే ఉపయోగపడతాయని, డెల్టా ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్, గుర్రపుడెక్క, తూడు పనులు చేర్చకపోతే డెల్టా ప్రాంతంలో కూలీలకు ఉపయోగం ఉండదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కం శెట్టి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కేశవరంలో జరిగిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఒకేరోజు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించడం సరికాదని అన్నారు. సభలో పాల్గొనే అవకాశం కలగదని తెలిపారు. 60 శాతం కూలీలకు ఖర్చు చేయాలని, 40 శాతం మెటీరియల్‌కు ఖర్చు చేయగలరని చట్టం చెబుతున్నా ఆచరణలో ఎక్కడా అమలు జరగడం లేదని తెలిపారు. పనిదినాలు 200 రోజులు పెరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామసభ స్పెషల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌరవు జిల్లా సహాయ కార్యదర్శి పిచ్చెట్టి నరసింహమూర్తి, నరాలశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

ఆకివీడు : ఉపాధి హామీ చట్టం కింద ప్రభుత్వం మండలానికి రూ.కోటి 33 లక్షల 50 వేలు మంజూరు చేసిందని ఆ శాఖ ఇన్‌ఛార్జి మణికంఠ తెలిపారు. ఈమేరకు ప్రభుత్వం నిర్వహించిన గ్రామసభల్లో ఆయా పంచాయతీల నుంచి ఆమోదం లభించింది. పెదకాపవరం, అప్పారావుపేట, కోళ్లపర్రు, కాలింగగూడెం, అజ్జమూరు గ్రామాలలో రెండేసి రోడ్లు, గుమ్మలూరులో మూడు రోడ్లు చొప్పున ప్రతిపాదించి గ్రామసభలో ఆమోదించారు.

నరసాపురం: మండలంలోని సీతారాంపురం సౌత్, రాజు గారితో గ్రామాలలో నిర్వహించిన గ్రామ సభలో నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. ఈ సభలో ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో భాగంగా గ్రామంలో చేపట్టనున్న వివిధ పనులు గుర్తించి, వాటిని ఉపాధి హామీ చట్టంలో చేర్చి, గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే కాకుండా, సంవత్సరానికి వందరోజులు పనిదినాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఆకన చంద్రశేఖర్, కోటిపల్లి వెంకటేశ్వరరావు, వలవల నాని, గంట కృష్ణా పాల్గొన్నారు.

మొగల్తూరు : గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. మొగల్తూరులోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ సర్పంచి పడవల మేరీ, తహశీల్దార్ ఎంపిడిఒ ఉన్ను బాబ్జి రాజు, వైస్ ఎంపిపి కైల సుబ్బారావు, మాజీ జెడ్‌పిటిసి గుబ్బల నాగరాజు ఉన్నారు.

తాడేపల్లిగూడెం: గ్రామసభల్లో తీసుకునే నిర్ణయాల ద్వారా ప్రజావసరలను తీర్చేందుకు కృషి చేద్దామని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం పెంటపాడు మండలం ప్రత్తిపాడు, కృష్ణయ్యపాలెం, తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేటలో జరిగిన గ్రామసభల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎంపిడిఒ ఎం.విశ్వనాథం, పెంటపాడు ఎంపిపి దాసరి హైమావతి, కూటమి నాయకులు, ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : గ్రామాల్లో అభివృద్ధికి ఉపాధి హామీ పనులు దోహదం చేస్తాయని ఎంపిడిఒ పి.పద్మజ అన్నారు. శుక్రవారం వెలగలవారి పాలెంలో జరిగిన గ్రామసభలో ఆమె ప్రత్యేక అధికారిగా పాల్గొని, కార్యక్రమాన్ని సమీక్షించారు. మండలంలో ఉదయం జరిగిన కొన్ని గ్రామాల్లో గ్రామ సభలకు వర్షం వల్ల ఆటంకం కలగగా, మధ్యాహ్నం జరిగిన గ్రామసభలకు హాజరు బాగుండి, సజావుగా జరిగాయి.

వీరవాసరం : మాట్లాడుతున్న ఎంఎల్ఎ అంజిబాబు

ఉన్నచోటే మరోసారి సీసీ రోడ్లకు తీర్మానం!

వీరవాసరం : వీరవాసరం పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ చట్టం నిధులతో చేపట్టబోయే పలు సీసీ రోడ్ల పనులను రద్దు చేయాలంటూ భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) పంచాయతీరాజ్ డిఇను ఆదేశించారు. వీరవాసరం పరిధిలో ఏడు సీసీ రోడ్లను సుమారు రూ.37 లక్షలతో పనులు చేపడుతున్నట్టు శుక్రవారం గ్రామసభలో తెలిపారు. అయితే వీటిలో ఐదు రోడ్లు ఇప్పటికే సీసీ రోడ్లుగా ఉండగా వాటిపైనే మరోసారి సీసీ రోడ్లు వేయాలంటూ తీర్మాణం చేయాలంటూ సభలో ప్రవేశపెట్టడం గమనార్హం. పంచాయతీ రాజ్ అధికారులు ఉద్దేశపూర్వకంగా సీసీ రోడ్లుపై సీసీ రోడ్లు వేసేందుకు ఇంకా ప్రారంభం కాని పనులను పనులు జరుగుతున్నాయంటూ చూపించి, ఎంఎల్ఎ అంజిబాబును తప్పుదోవ పట్టించి, ఈ పనులన్నీ ఆయన ప్రతిపాదించినట్టుగా గ్రామ సభలోకి తీసుకొచ్చినట్టు తెలుస్తుంది. ఈ పనులన్నీ గత వైసిపి ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సీసీ రోడ్లుపై సీసీ రోడ్లు వేసేందుకు ప్రతిపాదించిన పనులనే కొత్తగా అంజిబాబు ప్రతిపాదించినట్టు తీసుకురావడం జరిగింది. ఇదిలా ఉంటే గ్రామసభలో ప్రజలతో చర్చించి అత్యవసర పనులను ముందుగా చేపట్టాల్సి ఉంది. గ్రామసభలో ఏ పనులపైనా ఎటువంటి చర్చలేకుండా ఒక ఎత్తుగడతో సంబంధిత అధికారులు గ్రామసభ అర్థంతరంగా ముగించేశారు. ఇదిలా ఉంటే గ్రామంలో ఒక తట్ట కంకర కూడా వేయని మట్టి రోడ్లు ఉన్నాయి. అటువంటి వాటిని విస్మరించి సీసీ రోడ్లపైనే సీసీ రోడ్లు వేసేందుకు ఏ విధంగా నిర్ణయించారోనంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ అధికారులు చేస్తున్న జిమ్ముక్కులను గ్రహించి ప్రజలకు అవసరమైన పనులను చేపట్టాలని కోరుతున్నారు. అలాగే నందమూరుగరువులో ఉపాధి పనుల వల్ల రైతులకు ప్రయోజనం ఉండటం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చికిలే మంగతాయారు, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు, తహశీల్దార్ ఎవి.రామాజనేయులు, ఎంపిటిసి గుళ్లిపల్లి విజయలక్ష్మీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి మరిన్ని చర్యలు..

కార్యనిర్వహణ అధికారి మహాలక్ష్మి గణేష్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆలయ అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటున్నామని శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి బుద్ధ మహాలక్ష్మి గణేష్ అన్నారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం కార్యక్రమం నిర్వహించి, 2 వేల మందికి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో ప్రజాశక్తితో మాట్లాడుతూ ఆలయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు. ముఖ్యంగా యాత్రికులకు అందించే ప్రసాదాలు ఉదయం పులిహోర, మధ్యాహ్నం శనగలు, సాయంత్రం మళ్లీ పులిహోర అందిస్తున్నామని తెలిపారు. సుదూర ప్రాంతం నుంచి వచ్చే ప్రతి ఒక్క యాత్రికునికి అన్న ప్రసాదం అందించాలనే లక్ష్యంతో వీలైనంత ఎక్కువమందికి ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. నిత్యం సుమారు 200 మందికి అన్నదానం చేస్తున్నామని, శుక్రవారం రోజున 250 మందికిపైగా కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారన్నారు. స్థానిక ఎంఎల్ఎ అంజిబాబు ఆధ్వర్యంలో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసే విధంగా కృషి చేస్తా అన్నారు.

పదో తరగతి, ఇంటర్మీడియట్‌కు అడ్మిషన్లు ప్రారంభం

దూరవిద్యపై అవగాహనా ర్యాలీలో పాలకోడేరు ఎంఇఒ నాగరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

దూరవిద్య ద్వారా పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్య అభ్యసించేందుకు అడ్మిషన్లను ఆహ్వానిస్తున్నామని పాలకోడేరు ఎంఇఒ-1, పివిఎస్.నాగరాజు అన్నారు. శుక్రవారం పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు దూరవిద్యపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ నాగరాజు మాట్లాడుతూ 14 ఏళ్ళు నిండిన వారు పదవ తరగతి పరీక్షలకు అడ్మిషన్ పొందవచ్చు అన్నారు. ఇంటర్ అడ్మిషన్లు పొందే అభ్యర్థులు టెన్త్ ఉత్తీర్ణత సాధించాలన్నారు. అడ్మిషన్లకు ఈనెల 31వ తేదీ వరకు గడువు ఉందన్నారు. పాఠశాల హెచ్‌ఎం పి.మహేష్ బాబు మాట్లాడుతూ మహిళలకు, చిరు ఉద్యోగుల్లో ఉన్నవారికి ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్‌లో జాయిన్ అవ్వడానికి ఇది సువర్ణ అవకాశం అన్నారు. పూర్తి వివరాలకు పాలకోడేరు జిల్లా పరిషత్ పాఠశాలను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బకాయిలపై సమీక్ష

ప్రజాశక్తి - ఉండి

ఎన్‌టిఆర్ గృహ నిర్మాణంలో భాగంగా 2016-19 కాలంలో ఇళ్లను నిర్మించిన 1,283 మంది లబ్ధిదారులకు రూ.2 కోట్ల 30 లక్షల బకాయిలు ఉండడంతో వాటిని విడుదల చేసేందుకు ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు ఆదేశాల మేరకు గృహనిర్మాణం శాఖ సహాయ ఇంజనీర్‌తో టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలోని టిడిపి నాయకులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ గతంలో టిడిపి అధికారంలో ఉండగా నిర్మించిన ఇళ్లకు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిధులను నిలుపుదల చేశాడని, వాటిని నూతన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విడుదల చేసినందుకు సిద్ధంగా ఉండడంతో మండలంలోని గృహ నిర్మాణ లబ్ధిదారులకు రావలసిన బకాయిలను గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమావేశమైనట్లు నాగరాజు తెలిపారు.

ఘనంగా ప్రకాశం పంతులు జయంతి

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్ల : ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సీసలి స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పాఠశాల ఇన్‌ఛార్జి బిఆర్‌ఎం కె.స్వామి ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు బిఆర్‌ఎం కె.స్వామి మాట్లాడుతూ స్వాతంత్ర సమరంలో ఆంగ్లేయులకు తన రొమ్ము చూపి ఆంధ్రకేసరి పోరాడిన తీరును వివరించారు. ఆంధ్ర రాష్ట్రానికి మొట్టమొదటి ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవలను గూర్చి విద్యార్థులకు వివరించారు. ఎన్.విజయలక్ష్మి మాట్లాడుతూ ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జ్ఞాపకార్థం ఆంధ్రప్రదేశ్లో ఒక జిల్లాకు ప్రకాశం జిల్లాగా నామకరణం చేయడం జరిగిందన్నారు. విజయవాడలో కృష్ణా నదిపై నిర్మించిన బ్యారేజ్‌కు ప్రకాశం బ్యారేజ్‌గా నామకరణ చేశారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ప్రకాశం పంతులు జీవితచరిత్ర వివరించి స్వీట్స్ పంపిణీ చేశారు.

ఆచంట : ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు త్యాగాలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి అన్నారు. ఆచంట మండల పరిషత్ కార్యాలయంలో మొట్టమొదటి మాజీ ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఆచంట ఎంపిటిసి-2 తమ్మినీడి పృధ్వీ కుమార్, టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య, టిడిపి నాయకులు దబ్బా ప్రకాష్, మన్నే రాధిక, దిగుమర్తి రాజేష్, ఎంపిడిఒ పి.నరసింహ ప్రసాద్, ఎంఇఒ-1, ఉషారాణి ఎఒ జగన్నాధరావు, సీనియర్ అసిస్టెంట్ పి.నాగిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమంట్ర : బ్రిటిష్ వారి అహంకారానికి ఎదురొడ్డిన ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు మొత్తం తెలుగు జాతికి గర్వ కారణమని మార్టేరు ఫారం ఉప సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మార్టేరు ఫారం ప్రాంగణంలో ప్రకాశం పంతులు జయంతికి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, ఆయనను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సభకు అధ్యక్షత వహించిన మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు జాతి తెగువకు నిలువెత్తు నిదర్శనం అయిన ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం తరతరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు, వ్యవసాయ పాలిటెక్నిక్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తణుకు : ఆంధ్రకేసరి, ఆంధ్రా సింహం టంగుటూరి ప్రకాశం అని సాహితీ సామ్రాజ్యం అధ్యక్షులు తాడినాడ భాస్కరరావు అన్నారు. శుక్రవారం సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో స్థానిక గురజాడ విద్యానికేతన్ ప్రాంగణంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు టంగుటూరి జీవిత చరిత్రపై వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం తణుకు అసిస్టెంట్ సూపరింటిండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ మంగు సూర్యప్రకాష్, తెలుగు ఉపాధ్యాయురాలు విష్ణువర్జల సత్యలక్ష్మిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గురజాడ విద్యానికేతన్ డైరెక్టర్ పాతూరి సీతారామయ్యచౌదరి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కాజా లీలారాణి, హెచ్‌ఎం మైపాల దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పెరమాళ్ల, రామదాసు, బి.సాయిరామ్, మోహనరావు, ఆర్‌వి.రామకృష్ణ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఉచిత ఇసుక విధానం అమలు : కలెక్టర్

భీమవరం : జిల్లాలో ఉచిత ఇసుక విధానాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. జిల్లాలో ఇసుక అందుబాటులో లేకపోవడంతో పొరుగు జిల్లాల నుంచి ఇసుకను సులువుగా పొందేందుకు ఏర్పాట్లు చేసామని చెప్పారు. స్థానిక కలెక్టరేట్లో శుక్రవారం జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మితో కలిసి కలెక్టర్ టిప్పర్స్, లారీ ఓనర్స్‌తో సమావేశమైయారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లారీల యాజమాన్యంతో రవాణా చార్జీలు నిర్ణయం చేశామన్నారు. 20 టన్నుల లారీకి కిలోమీటర్ ఒక్కింటికి రూ.125, పది టన్నుల లారీకి కిలోమీటర్ ఒక్కింటికి రూ.80 ధర నిర్ణయించడం జరిగిందన్నారు. అంతకన్నా ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక లారీపై తార్పాలిన్ కప్పి ఉంచడం తప్పనిసరి అని సూచించారు. ఆయా ఇసుక రీచ్‌ల నుంచి పనివేళల్లో ఇసుకను పొందవచ్చునని తెలిపారు. రేవుల వద్ద వాహనంలోకి ఇసుక లోడింగ్ ఖర్చు, ప్రయాణ ఖర్చులు, ప్రభుత్వం వారికి చెల్లించవలసిన సీనరేజ్, జిఎస్‌టి తదితర ఖర్చులు మాత్రమే ఉంటాయన్నారు. మైన్స్ అండ్ జియాలజీ వెబ్ సైట్‌లో పూర్తి వివరాలు ఉన్నాయని, వినియోగదారులు తమ ఆధార్, ఇతర ధృవీకరణ పత్రాలను చూపి ఇసుక పొందవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇసుక విధానం అమలు చేస్తున్నామని, ఇసుక విధానంపై ఏవైనా సలహాలు, సూచనలు, ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1800-425-6024 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాస్థాయి ఇసుక కమిటీలో నిర్ణయించిన రేట్లు మాత్రమే లారీ టిప్పర్ యజమానులు వసూలు చేయాలని, అంతకుమించి వసూలు చేస్తే సంబంధిత వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు చర్యలు తప్పవని హెచ్చరించారు.

200 మందికి వైద్య పరీక్షలు

పాలకొల్లు : యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో మన్యం జగ్గమ్మ సత్రం సౌజన్యంతో శుక్రవారం సత్రంలో మణిపాల్ హాస్పిటల్ వైద్య నిపుణులచే మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మందికి పైగా మహిళలు సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు, అధ్యక్ష, కార్యదర్శులు జక్కంపూడి మదన్, వేరుకొండ దుర్గాప్రసాద్, సత్రం ఇఒ ముచ్చర్ల శ్రీనివాస్, పోకల రాము, జక్కంపూడి కుమార్, కటారి నాగు, కానూరి ప్రభాకర్, సిరిగినీడి రాంబాబు, కర్రా నరసింహారావు, యర్రంశెట్టి వెంకట రత్నం, గజ్జరపు సురేష్ పాల్గొన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, ఏలూరు
E.A.8/2024, E.P.5/2019 in O.S.47/2018
బిట్వీన్ :
మల్లిడి సునీల్‌రెడ్డి ...డిక్రీ హోల్డర్
మరియు
కలిమెల కిషోర్‌బాబు, S/o.జోసఫ్, వ్యాపారం, R/o.Opp.ఫైర్‌స్టేషన్, నరశింహారావుపేట, ఏలూరు, ప.గో.జల్లా. ...జడ్జిమెంటు డెటార్
పై నెంబరు E.P లో కోర్టు వారు నిర్ణయించిన ప్రారంభ ధరను తగ్గించమని కోరుచూ పిటీషను దాఖలు చేసినారు. సదరు పిటీషను ది.29-8-2024వ తేదీన 1వ రెస్పాండెంటు హాజరు నిమిత్తం వాయిదా వేసినారు. కావున 1వ రెస్పాండెంటు అయిన కలిమెల కిషోర్‌బాబు పైకోర్టు వారి ఎదుట ది.29-8-2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరు కావలెను. లేని ఎడల రెస్పాండెంటు పరోక్షంలో సదరు పిటీషను తీర్మానించబడును.
షెడ్యూలు : ఏలూరు జిల్లా, ఏలూరు టౌన్, పోస్టల్ కాలనీలోని గోవిందరాజపురం, హౌసింగ్ కాలనీ, శ్రీ శ్రీనివాసా కో-ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ లే-అవుట్ నెం.33/73లోని ఫ్లాట్ నెం.130 in R.S.No.119/2లో 348-0-0 చ॥గ॥ల స్థలం, అందులో గల ఆర్.సి.సి. బిల్డింగుకు హద్దులు. తూర్పు : ఫిషరీస్ డిపార్టుమెంటు వారి స్థలం. దక్షిణం: ప్లాటు నెం.129. ఉత్తరం:రోడ్డు. పడమర:రోడ్డు.
బి.గౌరీశంకర్, శ్రీమతి ఎ.శోభారాణి
ఏలూరు ఎ.వి.ఎస్.సూర్యారావు
ది.23-8-24 అడ్వకేట్స్, ఏలూరు.